INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN: 2277-7881; IMPACT FACTOR – 6.014; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 8, ISSUE 3, MARCH 2019

# అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీల ఆభరణ విశేషాలు

**– డా॥ జి. ఉషారాణి**
రీడర్ ఇన్ తెలుగు,
శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
పుంగనూరు, చిత్తూరు జిల్లా.

**ఉపోద్ఘాతం :**

సాహిత్యం సమాజంలో కనిపించే వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. అయితే వాస్తవికత యథాతథంగా కాకుండా నవరసాల మేళవింపుతో, వర్ణనల గుబాళింపుతో సృజనాత్మకంగా వ్యక్తపరచబడుతుంది. అందుకే సమాజం నుంచి సాహిత్యాన్ని, సాహిత్యం నుంచి సమాజాన్ని వేరుగా చూడలేమన్నది అక్షరసత్యం.

కావ్యాలు రాసిన కవులే కాదు, వాగ్గేయకారులు సైతం తమ సంకీర్తనల్లో సమాజంలోని వాస్తవాలను, జనజీవన చిత్రణను వారి ఆహార, ఆహార్య అంశాలను నిక్షిప్తంచేశారు. ఇటువంటి ఎన్నో వాస్తవిక, సాంఘిక అంశాలను తమ సంకీర్తనల్లో ప్రతిబింబింపజేసిన వాగ్గేయకారుల్లో తాళ్లపాక అన్నమాచార్యుడు అగ్రగణ్యుడు.

అన్నమయ్య తన జీవితంలో వివిధ ప్రాంతాలను సందర్శించి అక్కడి ప్రజలతో మమేకమై వారి భాష, ఆహారం, ఆహార్యం తదితర అన్ని అంశాలను తన కీర్తనల్లో ప్రస్తావించడం జరిగింది. అందులో ప్రత్యేకించి శృంగార సంకీర్తనల్లో నాయికను వర్ణించే సమయంలో ఆపాదమస్తకం స్త్రీలు ధరించే (దాదాపుగా) ప్రతి ఆభరణాన్ని తన సంకీర్తనల్లో నాయికకు అలంకరింపజేయడం జరిగింది.

**అన్నమయ్య నాయికకు ధరింపజేసిన ఆభరణ విశేషాలు :-**

స్త్రీలు ఆభరణాలను ధరించడం జన్మహక్కుగా భావిస్తారనడం అతిశయోక్తి కాదు. పూర్వకాలంలో అంతఃపుర స్త్రీలు, ఉన్నత వంశస్త్రీలు ఏడు వారాల నగలు ధరించేవారని ప్రతీతి. కాలం మారినా స్త్రీలకు ఆభరణాలమీద ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు.

"ఆడవాళ్ళకు సొమ్ములపైన ఉండే మోజు ఈనాటిది కాదు. హరప్పా, మొహంజదారో కాలం నాటి నుంచి స్త్రీలు వివిధ రకాలైన ఆభరణాలు ధరిస్తూనే ఉన్నారు. తక్షశిల త్రవ్వకాలలో చెవులకు పెట్టుకునే పోగులు, గాజులు, ఉంగరాలు, కంఠహారాలు, పతకాలు ఎన్నో రకాలవి బయటపడ్డాయి. అజంతా చిత్తరువుల్లో ఆ ముగుదల అలంకార ప్రియత్వం ఎంత కళాత్మకంగా ఉండేదో గోచరిస్తుంది. కంఠహారాలు, మొలనూళ్ళు, కంకణాలు, శిరోజాలంకరణ – ఇవన్నీ ఆ చుక్కల చక్కదనానికి వాసి తెచ్చిపెట్టే అలంకారాలే" (1)

స్త్రీల అలంకరణను వివరిస్తూ సురవరం ప్రతాపరెడ్డిగారు "పూర్వము స్త్రీలకేమి సౌందర్యమనిపించెనో యేమో! ముంగర, ముక్కెర, నెత్తిబిళ్ళలు, దండకండెములు, వంకీలు మున్నగునవి ధరిస్తూ ఉండిరి. తోమాల దండను వేసుకొనుచుండిరి" (2) క్రీడాభిరామంలో స్త్రీలు తాటంకాలు, ముత్యాలకమ్మలు, కాంచిమూకుర కంకణాలు, త్రిసరాలు, మొరవంక కడియాలు ధరించినట్లు వర్ణింపబడింది.

---

(1) తెలుగు వెలుగు – సి. వేదవతి, పుట : 38.

(2) ఆంధ్రుల సాంఘిక చరిత్ర – శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, పుట : 219

కావ్యాలలో నాయికల వర్ణన, వేషభూషణాల వర్ణన సులభమే. కానీ ఒక పల్లవి, కొన్ని చరణాలకు పరిమితమై ముగిసే సంకీర్తనల్లో నాయికల ఆభరణాల వర్ణన చేయడం క్లిష్టతరం. అన్నమయ్య ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ తన కాలంలో స్త్రీలు ధరించిన వివిధ ఆభరణాలను నాయికల వర్ణన సమయంలో సందర్భోచితంగా ధరింపజేయడం అభినందనీయం. ఈ ఆభరణాలను శిరోభూషణాలు, కర్ణాభరణాలు, నాసికాభరణాలు, కంఠాభరణాలు, శ్రోణీ విభూషణాలు, హస్తాభరణాలు, పాదాభరణాలు .... గా విభజించి పరిశీలించడమైనది.

**శిరోభూషణాలు:**

స్త్రీలు ధరించే ఆభరణాల్లో శిరస్సుకు ధరించేవి ప్రత్యేకంగా వున్నాయి.

**1) తలబిళ్ళలు (28-212) :** ఇది తలలో పెట్టుకొనేవి.

- **చంద్రవంకలు (24-46), (24-354), (26-84):** వీటిని తలకు కుడి ప్రక్కో యెడమ ప్రక్కో ధరిస్తారు. ఇవి అర్ధ చంద్రాకారంలో వుంటాయి. సూర్యవంకల ప్రస్తావన అన్నమయ్య సంకీర్తనల్లో లేదు.
- **వజ్రాల బిళ్ళలు (26-212):** బంగారంలో వజ్రాల్ని పొదిగిన గుండ్రని బిళ్ళ.
- **నెమలీకలు, పింఛపుకన్ను (12-121):** ధనవంతులైన స్త్రీలు ఖరీదైన వజ్రాల బిళ్ళల్లాంటి ఆభరణాల్ని ధరిస్తే ఆటవిక స్త్రీలైన చెంచెతల్లాంటి స్త్రీలు తమ కొప్పుని ప్రకృతిసిద్ధంగా లభించే నెమలి కన్నులతో అలంకరించేవారు.

**2) కుప్పె :** గుండ్రంగా, వేలాడుతూ వుండేవి కుప్పెలు. వీటిని పలురకాల లోహాలతో తయారుచేస్తారు.

- **వెండి కుప్పెలు (12-103):** వెండితో చేసినవి.
- **సన్నపు మణుల కుప్పె (12-277):** సన్నని మణులు పొదగబడిన బంగారు కుప్పె అయివుండొచ్చు.

**3) కుచ్చులు :** కుప్పెలు గుండ్రంగా, లావుగా వుంటే, మెత్తగా, పోగులుగా, పైన లోహంతో వుండేవి కుచ్చులు. అన్నమయ్య ఒక సంకీర్తనలో కుందనపు ముత్యాల కుచ్చులు (12-73) అని పేర్కొన్నాడు. బహుశా యివి బంగారంతో చేయబడి, ముత్యాలు పొదగబడినవై వుంటాయి.

**4) ముత్యాలు :** కొప్పునుగాని, జడనుగాని వేసికొని, వెంట్రుకలకు అలంకారంగా గుచ్చుకుంటారు.

**కర్ణాభరణాలు:**

చెవులకు పెట్టుకొనే ఆభరణాల్లో కమ్మలు, జూకాలు మొదలైన ఆభరణాల్ని ప్రముఖంగా చెప్పుకోవచ్చు. అన్నమయ్య సంకీర్తనల్లో నాయికలు కమ్మలు, కుండలాలు (పోగులు), జూకాలు ధరించారు.

**1) కమ్మలు :** చెవుల తమ్మెలకు అతుక్కొని పోయినట్లు వుండే ఆభరణాలే కమ్మలు. ఇందులో కూడా యెన్నో రకాలున్నాయి.

- **బంగారు కమ్మ (18-379), (24-407):** తళుకుగమ్మ (18-379)
- **వజ్రాలకమ్మలు (32-239) :** వీటిలో వజ్రాలు పొదగబడి వుంటాయి.
- **ముత్తేల కమ్మలు (32-60):** ముత్తియపుఁ గమ్మలు (12-297) బంగారంలో ముత్యాలు పొదిగివుంటాయి.

**2) కుండలాలు :** ఇవి బోలుగా, లావుగా, గుండ్రంగా చెవులకు ధరించేవి.

- **కుండలాలు (6-207) :** గుండ్రంగా వేలాడుతూవుంటాయి.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN: 2277-7881; IMPACT FACTOR – 6.014; IC VALUE:5.16; ISI VALUE:2.286
VOLUME 8, ISSUE 3, MARCH 2019

- **మాణికాల పోగులు (12-225), (12-219)** : చెవులకు వేలాడుతూ మాణిక్యాలు కూర్చినవై వుంటాయి.
- **మద్దికాయల పోగులు (12-218):** ఇవి ఆటవిక స్త్రీలు ధరించి వుండొచ్చు.

**3) ముత్యాల జల్లుల చేర్పులు (12-82)** : ఇవి చెవులనుండి క్రిందికి భుజాలమీదుగా వేలాడే ఆభరణాలు. అంటే యిప్పటి వ్యవహారంలో వుండే జూకాలు కావచ్చు.

**నాసికాభరణాలు :**

ముఖంలో తళుక్కుమంటూ మెరుస్తూ ఆడవారికి యెంతో ప్రీతిపాత్రమైంది, అందాన్నిచ్చేది ముక్కుపుడక. ఆడపిల్లలు కౌమారంలోకి అడుగుపెట్టేలోగా ముక్కును కుట్టిస్తారు. కొంతమంది ముక్కుకు యెడమప్రక్క పుడకను ధరిస్తే, మరికొంతమంది కుడిప్రక్క ధరిస్తారు. కొద్దిమంది మొదటిసారి యెడమవైపు కుట్టించి, పెళ్ళవగానే కుడిముక్కు కుట్టించేస్తారు. ఇది కొందరి ఆచారం. ముక్కు కింద వేలాడుతూ వుండేది బులాకీ. అన్నమయ్య సంకీర్తనల్లో ముక్కెర మాత్రం ప్రస్తావించబడింది.

**ముక్కున బెట్టిన నా ముత్తెమే (24-277), ముక్కెర (24-174)**

**కంఠాభరణాలు:**

శంఖం వంటి మెడను బంగారుహారాలు ఆక్రమిస్తే ఆ మెడ అందం వర్ణించనలవి కాదు. ఇవి రకరకాల లోహాలతో, రకరకాల రత్నాలతో, ముత్యాలతో, పూసలతో తయారు చేయబడి వుంటాయి.

అన్నమయ్య సంకీర్తనల్లోని నాయికలు మేమేమీ యితరులకు తీసిపోమంటూ రకరకాల హారాలను, పతకాలను, సరులను, దండలను, పేరులను, పూసలను ధరించారు.

**1) హారాలు** : అన్నమయ్య రకరకాల హారాలను తన స్వామి నాయికలచేత అలంకరింపజేశాడు.

- నీల **హారములు (24-188)** : నీలపురాళ్ళతో చేసిన హారాలు.
- **మణి హారములు (12-277)** : మణులతో కూర్చిన హారాలు
- **నీలమణి హారములు (12-258)** : నీలపుమణులతో చేసిన హారాలై వుండొచ్చు.
- **అచ్చపుఁ గుచ్చుల ముత్యాలహారము (12-302):** ముత్యాలను గుత్తులు, గుత్తులుగా వొకచోట చేర్చి ఆ గుత్తులన్నింటినీ కలిపి చేసిన హారమై వుండొచ్చు.
- **ఐన్నసరి కంఠమాల (24-455)** : నానా విధములగు మణులు గ్రుచ్చిన హారము.

**2) పతకాలు** : హారాల కింద భాగంలో మధ్యగా వేలాడే బిళ్ళను **పతకం** అంటారు. ఇది హారానికి అందాన్ని చేకూరుస్తుంది. అన్నమయ్య వర్ణించిన నాయికలు సైతం తమ హారాలకు యీ పతకాన్ని ధరించారు.

- **పదకములు (1-133)**
- **ఘనమైన ముత్యాల కంటమాల పదకము (5-75)** : పెద్దదైన ముత్యాల కంఠమాలకు వేసిన పదకము యిది.

**3) సరులు** : అన్నమయ్య సంకీర్తనల్లో పలురకాల సరుల్ని చూడొచ్చు.

- **ముత్యాల సరులు (4-147)**
- **పోకంతేసి ముత్యాల కంట సరులు (12-238)**

- **నీలపుఁ గంట సరుల (12-341)** : నీలపురాళ్ళతో కూర్చి చేయబడ్డ కంఠహారమై వుంటుంది.
- **జందెపు ముత్తెపు సరులు (12-107)** : ముత్యాలతో కూర్చిన హారం. దీన్ని ఆనాటి స్త్రీలు బహుశా జందెంలా వేసికొని వుండొచ్చు.

**4) దండలు** : రకరకాల పూసలతో చేసిన దండలు అన్నమయ్య సంకీర్తనల్లో దర్శనమిస్తాయి.

- **పచ్చిపగడపు దండ (28-18)** : ఇంకా యెండని పచ్చిపగడాలతో చేసినవై వుంటుంది.
- **పగడాల దండ (24-323)** : పగడాలతో చేసిన దండ.
- **ముత్యాలదండ (24-344)** : ముత్యాలతో కూర్చిన దండ.
- **నీలాల దండ (32-95)** : నీలాలతో చేసింది.
- **జమళి పీకిలిదండ (25-418)** : ఇది చెంచెత వర్ణనలో ప్రస్తావించబడింది. కాబట్టి దీన్ని ఆటవికస్త్రీలు ధరించి ఉండవచ్చు.

**5) పేరులు** : అన్నమయ్య సంకీర్తనలో క్రింది రకాల పేరులు కనిపిస్తున్నాయి.

- **పెద్దపెద్ద ముత్యాల పేరులు (12-184)** :
- **మాణికముల పేరు (12-144), (24-114):**
- **గురిగింజపేరు (32-404)** : చెంచెతల వంటి ఆటవిక స్త్రీలు ధరించి వుండొచ్చు.

**6) పూసలు** : ధనవంతురాలైన స్త్రీలు నవరత్నాలను, బంగారాన్ని ధరిస్తే; పేదస్త్రీలు రకరకాల వెలలేని పూసల్ని, ముత్తైదువులు నల్లపూసల్ని ధరిస్తారు. అన్నమయ్య సంకీర్తనల్లో నల్లపూసలు (24-531) ప్రస్తావన కనిపిస్తోంది.

**7) రూపు :**

> **"స్వైర విహారధీరలగు ...............**
> **లలితాంగి రూపు కన్నాఁరఁగ జూచివచ్చితి" (1)**

అన్న పద్యంలో లలితాంగి రూపు అనే పదానికి సామాన్యార్థం వనిత అందమనే తోస్తుంది. కానీ యీ రూపు పదానికి పెళ్ళికాని కన్యలు ధరించే ఆభరణం అనే అర్థం కూడా వుంది.

అన్నమయ్య కూడ వొక సంకీర్తనలో తన నాయిక చేత రూపు అనే యీ ఆభరణాన్ని ధరింపజేశాడు. "చేతిలోని దొకరూపు చేరి నాపేరిట రూపు" (25-82)

**శ్రోణీవిభూషణములు :**

నడుములేని చిన్నదైనా నడుము మోయలేని యెన్నో రకాల ఆభరణాల్ని ధరించటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. "కాంచి, మేఖల, రశన, కలాపము, ముక్తా జాలాఢ్యమగు తలకము, కాంచి, ఏకష్టిక (ఒంటి పేట కలది). మేఖల, అష్టయష్టిక, దేవపార్థివ ముక్తాహారాలు" (2) శ్రోణీవిభూషణాలుగా చెప్పబడ్డాయి.

**1) ఒడ్డాణములు** : ఇది వొక నడుముకు ధరించే ఆభరణం. పైడి ఒడ్డాణములు (24-188), బంగారు వొడ్డాణము (3-117)

(1) వసుచరిత్ర - రామరాజభూషణుడు, ద్వితీయాశ్వాసం, 55వ పద్యం

(2) నాట్యశాస్త్రం : అనువాదం - పోణంగి శ్రీరామ అప్పారావు

**2) మొలనూళ్ళు :** "ఆడువారు అలంకారార్థం ధరించెడు కటి సూత్రము " (1)

- **మొలనూళ్ళు (26-121), (24-52)**
- **మొగపుల సింహాల మొలనూలు (26-213)**
- **మొలనూళ్ళ సకుపులు (12-325)**
- **మొలనూలి గంటలివి (12-258), మొరయు గంటలతోడి మొలనూళు (32-310):** మొలనూలుకు కింది భాగంలో చినచిన్న గంటల్ని అమర్చి వుంటారేమో!
- **మొలనూలి మెగవులు (24-455) :** మొగపులు "హారాదుల ముఖభాగం" (2) హారాదులకు ముఖభాగం పదకమే అయివుంటుంది. అంటే యీ మొల నూళ్ళకు కూడా పదకాలు వేలాడేట్టుగా అమర్చివుండొచ్చు.

**హస్తాభరణాలు :**

హస్తాభరణాల్లో బాహువులు మొదలుకొని వేళ్ళదాకా రకరకాల ఆభరణాల్ని ధరించి స్త్రీలు మురిసిపోతారు. పూర్వం స్త్రీలు దండచేతులకు "దండకడియాలూ, వంకీలూ, గజ్జెల తాబేదూ, బాజాబందులు పెట్టుకొనేవారు. ఇక ముంజేతులకు గాజుల కంకణాలు, గోట్లు, పోచీలు, మురుగులు, పులిశేరు గొలుసులూ వుండేవి." (3)

**1) బాహువులకు ధరించేవి :**

బాహుమూలాల్లో ధరించే అభరణాల ప్రస్తావన అన్నమయ్య సంకీర్తనల్లో కనిపిస్తోంది.

- **సంది దండలు (12-107) :** భుజాలకు, చేతులకు సంధిలా నిలిచే భాగమిది. ఈ ప్రదేశంలో వ్రేలాడేలా ధరించేవి.
- **పగడాల చేఁకట్లు (24-455) :** బాహువులకు చుట్టుకొనే పగడాల ఆభరణం.

**2) ముంజేతికి ధరించేవి :**

ముంజేతికి ధరించే కంకణాలు, కడియాలు, మురువులు, గాజులు అన్నమయ్య సంకీర్తనల్లో కన్పిస్తాయి.

**ఎ) కంకణాలు :**

"పలుచగా రేకుల్లా వెడల్పాటి గాజుల్లా వుండేవి కంకణాలు" (4) అన్నమయ్య సంకీర్తనల్లో కనిపించే కంకణాలు.

- **ముంజేతి కంకణం (24-110) :** ఇవి సాధారణమైనవి.
- **ముత్తేల కంకణాలు (12-304) :** కంకణాల్లో ముత్యాలు పొదిగివుంటాయి.

**బి) కడియాలు :**

"బోలుగా వుండేవి కడియాలు. ఇవి బంగారంతో చేయబడి వుంటాయి" (5) అన్నమయ్య రెండు రకాల కడియాల్ని పేర్కొన్నాడు.

- **చేమపూవు కడియాలు (12-148) :** కడియాలమీద చేమపూవులు చెక్కివుండొచ్చు.
- **సంకు గడెము (25-418) :** ఇది శంఖు ఆకారంలో వుండి వుంటుంది.

---

(1) & (2) శబ్ద రత్నాకరము – బి. సీతారామాచార్యులు

(3) తెలుగు వెలుగు – సి. వేదవతి, పుట : 49.

(4) & (5) జానపదగేయగాథల్లో స్త్రీ – ఆచార్య మూలె విజయలక్ష్మి, పుట : 16.

**సి) మురువులు:** "ముంజేతినగ. పట్టెల తీర కడ్డీగా కొట్టింది ముంజేతి ధరించెడు ఆభరణము" (1) చేతిమురువులు (12-206).

**డి) గాజులు:**

- **పసిండి గాజులు (24-234) :** ధనవంతులైన స్త్రీలు బంగారు గాజుల్ని ధరించారు.
- **మంటి గాజులు (1-222) :** The very lowest form of all is, of course the cheap glass bangles" .. (2) పేద స్త్రీలు తమ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మట్టిగాజులు ధరించేవారు.

**ఉంగరాలు:**

ఉంగరాల వేళ్ళతో మొట్టితే ఎవరైనా మాట వింటారు అనే సామెత ఆ మొట్టే చేతికి కాక, ఆ చేతి వేలికి తొడిగిన ఉంగరానికి ప్రాధాన్యతనిస్తోంది. ఉంగరాన్ని ధరించేటప్పుడు కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలంటారు జ్యోతిష్కులు. ఒక్కో నక్షత్రానికి చెందినవారు ఒక్కో జాతిరాయిని ధరించాలట.

అన్నమయ్య సంకీర్తనల్లోని నాయికలు ఏ నక్షత్రాలకు చెందుతారో కానీ, ఆయన వాళ్ళ వేళ్ళకు రకరకాల ఉంగరాల్ని ధరింపజేశాడు.

- **ఉంగరాలు (24-480), (24-487), (1-69) :** ఏరాయీ పొదగకుండా కేవలం బంగారుతో చేయబడింది.
- **మాణికపు టుంగరం (12-302) :** బంగారులో మాణిక్యం పొదగబడి వుంటుంది.
- **పద్మరాగాల వుంగరాలు (14-282)**
- **బంగారు సరపణుటుంగరాలు (12-341)**

**పాదాభరణాలు :**

ఘల్లు ఘల్లున కాళ్ళ గజ్జెలందెలు మ్రోయ కలహంస నడకాల కలికీ ... అంటూ స్త్రీల నడకల అందాల్ని వర్ణించటం సహజమే. స్త్రీల పాదాలు సున్నితంగా, అందంగా వుంటాయి. ఆ అందానికి అలంకారం తోడైతే మరి పువ్వుకు తావి అబ్బినట్లేకదా! మన భారతీయస్త్రీలు పాదాలకు అందెలు, మెట్టెలు, కడియాలు, గజ్జెలు, పెండెములు మొదలైనవి ధరించేవారు.

**1) పెండెము:** "కాలను ధరించెడి యందియ" (3)

పెండెము (24-144) వజ్రపు పెండెము (3-24), ముత్తేలపెండెము (12-283). ఇవి వజ్రాలతో, ముత్యాలతో పొదగబడినవై ఉండవచ్చు.

**2) అందెలు: అందెల మ్రోతలు (3-24) :** అందెలు (24-67), గాంటపుటందియలు (26-121), కనకపుటందెలు (32-117) అనే ప్రయోగాలు అన్నమయ్య సంకీర్తనల్లో కనిపిస్తున్నాయి.

**3) మట్టెలు :** పెళ్ళయిన స్త్రీలు తమ సౌభాగ్యానికి చిహ్నంగా ధరించే వాటిలో మట్టెలు ముఖ్యమైనవి. ధనిక స్త్రీలు బంగారు, వెండితో చేసిన మట్టెల్ని ధరిస్తే, పేద స్త్రీలు కంచు మొదలైన సామాన్య లోహంతో చేసిన మట్టెల్ని ధరిస్తారు. (24-81, 409) (12-353).

---

(1) శబ్దరత్నాకరము – బి. సీతారామాచార్యులు.

(2) Woman in India - Mary Frances Billington, Page : 203.

(3) శబ్ద రత్నాకరము – బి. సీతారామాచార్యులు

**4) బొబ్బిలికాయలతోడి మట్టెలదె (12-365) :** ఆనాటి స్త్రీలు బొబ్బిలి కాయలనే ఆభరణాల్ని కాలివేళ్ళకు ధరించినట్లు తెలుస్తోంది.

**5) పాదరక్షలు :** అన్నమయ్య అమ్మవారి పాదాలు యెక్కడ కందిపోతాయో అని భయపడ్డాడు కాబోలు "జమళి ముత్యాలతోడి చమ్మాళిగలిడరో" (12-7) అని ఆమెకు పాదరక్షల్ని కూడా తొడిగాడు. "ఇందిరా సుందరాంగికి ముత్యాల పావుకోళ్ళు పట్టరో" (1) అని అన్నమయ్య చెలికత్తెలను పురమాయించాడు.

**కనకపుఁ జమ్మాళిగలు మెట్టియల జ**
**వ్వని గర్వమున నిట్టె వచ్చి వచ్చి (12-83)**

నాయిక బంగారు పాదరక్షలు ధరించింది. దానికి తోడు ఆ నడకకు గర్వం కూడ తోడైంది. మెట్టిన చమ్మాళిగలు మించఁబారితెంచి... (13-326) అనే చోట కూడ పాదరక్షల ప్రస్తావన కనిపిస్తోంది.

**ముగింపు :-**

పైన పేర్కొన్న ఆభరణవిశేషాల ఆధారంగా అన్నమయ్య తన కాలంనాటి సమాజాన్ని ఎంతటి సునిశితదృష్టితో పరిశీలించాడో అర్థం చేసుకోవచ్చు. అన్నమయ్య సంకీర్తనలను ఆధారం చేసుకుని ఆనాటి స్త్రీలు ఎన్ని రకాల ఆభరణాలను ధరించేవారో తెలుస్తోంది.

**ఆధార గ్రంథాలు:**

1. అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీ : డాక్టర్ గుమ్మనూరు ఉషారాణి, శ్రీనిధి ప్రచురణలు, చిత్తూరు.
2. తెలుగు వెలుగు : సి. వేదవతి, స్పందన సాహితీసమాఖ్య ప్రచురణ, మచిలీపట్నం.
3. ఆంధ్రుల సాంఘిక చరిత్ర : శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, సాహిత్య వైజయంతి ప్రచురణలు, హైదరాబాదు.
4. వసుచరిత్ర : రామరాజభూషణుడు, బాలసరస్వతి బుక్ డిపో, ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్, కర్నూలు (1956).
5. నాట్యశాస్త్రం – అనువాదం : పోణంగి శ్రీరామ అప్పారావు, అజంతా ప్రింటర్స్, మహంకాళి వీధి, సికింద్రాబాదు.
6. శబ్ద రత్నాకరము : బహుజనపల్లి సీతారామాచార్యులు, ఏషియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్, శ్రీపురం 1వ వీధి, మద్రాసు -4.
7. Woman in India - Mary Frances Billington, Kiran Mudran Kendra, A-38/2, Mayapuri, Phase-I, New Delhi - 110064, 2nd Edition - 1987.
6. జానపదగేయగాథల్లో స్త్రీ : ఆచార్య మూలె విజయలక్ష్మి, యం.బి.యం.ఆర్. ప్రచురణలు, నిడుజువ్వి – 516 308.
7. తాళ్ళపాక అన్నమయ్య పాటలు : స్వరపరిచినవారు : రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, భావ వివరణ – శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు, తి.తి.దే ప్రచురణలు, తిరుపతి (1976).
8. తాళ్ళపాక అన్నమార్యుల శృంగార సంకీర్తనలు.

❖❖❖

(1) తాళ్ళపాక అన్నమయ్య పాటలు – భావవివరణ, కామిశెట్టి శ్రీనివాసులు , పుట: 14, జమళి – జంట, చమ్మాళిగలు – పాదరక్షలు.